# రూతు చరిత్ర



పరిశుద్ధ గ్రంథం యొక్క ప్రాథమిక సత్యాలు

# పాఠం -- 22

# రూతు చరిత్ర

పాత నిబంధనలో జరిగిన రూతు చరిత్ర అనే పాఠాన్ని మనం ఈరోజు పరిశోధించుటకు,

- ✓ ఈ చరిత్ర యొక్క నేపథ్యం ఏమిటి మరియు ఇవి ఏ కాలంలో జరిగాయి?
- ✓ ఈ చరిత్ర ఎందుకు వ్రాయబడింది?
- ✓ వీటిని మనం ఎందుకు చూడాలి?
- ✓ ఇవి మనకు దేనిని సూచిస్తున్నాయి?
- ✓ ఇవి మనకు ఎటువంటి బోధను ఇస్తున్నాయి?
- ✓ ఈ చరిత్ర యొక్క నీడ (సాదృశ్యం) అర్థం ఏమిటి?

ఇటువంటి ప్రశ్నలకు ఆధ్యాత్మిక సత్యమైన అర్థాన్ని తెలుసుకోవడానికి, బైబిలు వచనాల ఆధారంగా వివరంగా పరిశోధిద్దాం.

## ➡ చారిత్రక నేపథ్యం

### రూతు 1 : 1 – 3, 14

రూతు చరిత్ర అనే ఈ సంఘటన క్రీ.పూ. 1250 సంవత్సరాలకు పూర్వం యూదయ దేశంలో న్యాయాధిపతులు న్యాయము తీర్చుచున్న కాలంలో జరిగిన సంఘటన. ఆ దినములలో దేశంలో కరువు కలిగింది. దీనివల్ల బెత్లెహేములో ఉన్న ఎలీమెలెకు తన కుటుంబంతో కరువు నుండి తప్పించుకోవడానికి, దేవుని ఆజ్ఞకు విరుద్ధంగా మోయాబు దేశానికి వెళ్ళారు. అక్కడకు వెళ్ళిన కొద్ది రోజుల్లోనే ఎలీమెలెకు మరణించాడు. ఆ తర్వాత ఇద్దరు కుమారులు మోయాబు దేశపు స్త్రీలను వివాహం

చేసుకున్నారు. ఆ పిమ్మట కుమారులు ఇద్దరూ కూడా మరణించారు. ఆ తర్వాత తన దేశంలోనే ఆహారం దొరుకుతుందని తెలుసుకున్న నయోమి, తన సొంత ఊరికి తిరిగి వచ్చింది. తన ఒక కోడలు ఓర్పా తన తల్లి ఇంటికి తిరిగి వెళ్ళిపోయింది. కానీ రూతు అనే కోడలు మాత్రము బెత్లెహేమునకు నయోమితో కలిసి వచ్చింది. ఆ తర్వాత బోయజు అనే ఆయన రూతును వివాహం చేసుకున్నాడు. ఆయన గొప్ప ఐశ్వర్యవంతుడు. ఇదే రూతు చరిత్ర యొక్క చారిత్రక నేపథ్యం.

## కరువు నుండి బ్రతుకుటకు మోయాబు వెళ్ళుట

### రూతు 1 : 1 – 2

ఇశ్రాయేలు దేశంలో కరువు వచ్చిన రోజుల్లో ఎలీమెలెకు కుటుంబం, బెత్లెహేమును విడిచి మోయాబు దేశానికి కరువు నుండి బ్రతుకుటకు వెళ్ళారు. ఎలీమెలెకు భార్య పేరు నయోమి, ఆయన ఇద్దరు కుమారులు మహ్లోను, కిల్యోను. ఈ విధంగా, కరువు నుండి తప్పించుకోవడానికి నలుగురు మోయాబు దేశానికి వెళ్ళారు.

## నయోమి భర్త, కుమారుల మరణం

### రూతు 1 : 3 – 5

మోయాబు దేశంలో నయోమి భర్త ఎలీమెలెకు కొద్ది రోజుల్లోనే మరణించాడు. ఆ తర్వాత, మోయాబు దేశంలో నయోమి తన ఇద్దరు కుమారులకు భార్యలను తెచ్చింది. వారిలో ఒకరి పేరు ఓర్పా, మరొకరి పేరు రూతు. నయోమి కుమారులైన మహ్లోను, కిల్యోను కూడా మరణించారు. దీనివల్ల నయోమి మరియు ఆమె ఇద్దరు కోడళ్ళు విధవరాండ్రులు అయ్యారు. ఈ విధంగా, మోయాబు దేశంలో నయోమి సుమారు పది సంవత్సరాలు నివసించింది.

## కరువు తీరి బెత్లెహేమునకు వెళ్ళుట

### రూతు 1 : 6 – 10

యెహోవా తన ప్రజలను దర్శించి వారికి ఆహారం ఇచ్చాడని మోయాబులో ఉన్న నయోమి విని, బెత్లెహేమునకు రావడానికి ఇద్దరు కోడళ్లను నడిపిస్తుండగా, తన ఇద్దరు కోడళ్లను చూసి, మీరు మీ తల్లి ఇంటికి తిరిగి వెళ్ళండి అని చెప్పింది. మరణించిన వారి పట్ల మరియు నా పట్ల మీరు దయ చూపినట్లు యెహోవా మీ పట్ల దయ చూపును గాక. మీరిద్దరూ భర్త ఇంట సుఖంగా ఉండునట్లు ఆయన చేయును గాక అని చెప్పి వారిని ముద్దు పెట్టుకుంది. కానీ, వారు ఇద్దరూ ఎలుగెత్తి ఏడ్చి, ఆమెను చూసి మేము నీతోనే వస్తాము అన్నారు.

## ఓర్పా నయోమిని ముద్దు పెట్టుకుని వెళ్ళుట

### రూతు 1 : 11 – 15

నయోమి మరల తన కోడళ్లను చూసి, నా బిడ్డలారా, మీరు తిరిగి వెళ్ళండి. నా వల్ల మీకు ఇకముందు ఎటువంటి మేలు కలుగదు. యెహోవా హస్తం నాకు విరోధంగా ఉంది. మీ నిమిత్తం నేను ఎంతో వ్యధ చెందుతున్నాను అని చెప్పింది. అప్పుడు వారు ఇద్దరూ ఎలుగెత్తి ఏడ్చారు. ఆ తర్వాత ఓర్పా, నయోమిని ముద్దు పెట్టుకుని తన తల్లి ఇంటికి వెళ్ళిపోయింది. రూతు ఆమెను విడువక హత్తుకుంది. అప్పుడు నయోమి నీ తోటి కోడలు తన ప్రజల వద్దకు, తన దేవతల వద్దకు వెళ్ళిపోయింది కదా, నీవు కూడా వెళ్ళు అని చెప్పింది.

## రూతు, నయోమితో కలిసి బెత్లెహేమునకు వెళ్ళుట

### రూతు 1 : 16 – 22

తిరిగి వెళ్ళమని తన అత్త చెప్పిన మాట విన్న రూతు, నేను తిరిగి వెళ్ళుట గురించి నాతో మాట్లాడవద్దు. నీవు వెళ్ళు చోటుకే నేను వస్తాను. నీవు నివసించు చోటనే నేను నివసిస్తాను. నీ ప్రజలే నా ప్రజలు, నీ దేవుడే నా దేవుడు. మరణమే తప్ప మరేదీ నిన్ను నన్ను విడదీయదు అని చెప్పి, రూతు తన అత్తను వెంబడించింది. ఆ తర్వాత నయోమి దాని గురించి ఏమీ మాట్లాడలేదు. ఈ విధంగా, వారు ఇద్దరూ బెత్లెహేమునకు వచ్చినప్పుడు, అక్కడ యవల కోత కాలమై ఉంది.

## రూతు వెన్నులు ఏరుకొనుటకు వెళ్ళుట

### రూతు 2 : 1 – 13

మోయాబు స్త్రీయైన రూతు నయోమిని చూసి, నేను ఎవరి పొలమునకు వెళ్ళి, ఎవరి కళ్ళల్లో దయ పొందుతానో, వారి వెనుక వెళ్ళి వెన్నులు ఏరుకొని వస్తానని అడగగా, అత్త అనుమతితో వెన్నులు ఏరుకొనుటకు బయలుదేరింది. అనుకోకుండా ఆమె వెన్నులు ఏరుకున్న పొలం బోయజుది. అప్పుడు బోయజు అక్కడికి వచ్చి, పనివారిని చూసి: ఈ చిన్నది ఎవరిది? అని అడగగా, ఆమె నయోమితో కలిసి వచ్చిన మోయాబు చిన్నదని చెప్పారు. కోయువారి వెనుక పడి వెన్నులు ఏరుకుంటాను అని నన్ను అడిగింది. కొంతసేపు మాత్రము ఆమె యింట కూర్చుండెనని వాడు చెప్పెను. అప్పుడు బోయజు రూతును చూసి, నా కుమారీ, వినుము; వెన్నులు ఏరుకొనుటకు వేరే పొలమునకు వెళ్ళవద్దు, ఇక్కడే నా పనికత్తెలతో కలిసి ఉండమని చెప్పాడు. వారు కోత కోయు పొలాన్ని చూసి, నీవు వారి వెనుక వెళ్ళుము. నిన్ను ఎవరూ ముట్టకుండా ఆజ్ఞాపించాను. నీకు దప్పిక వేస్తే, పనివారు ముంచి తెచ్చిన నీళ్లు తాగవచ్చని చెప్పాడు. అప్పుడు రూతు నేల వరకు వంగి నమస్కరించి, నేను అన్యదేశపు

దానను ఉండగా, నన్ను విచారించుటకు నీ కళ్ళల్లో దయ ఎలా కలిగిందని అడిగింది. అప్పుడు బోయజు రూతును చూసి, నీ భర్త మరణించిన తర్వాత, నీవు నీ అత్తకు చేసినదంతా, నీ జన్మదేశాన్ని విడిచి, నీవు ఎరుగని ప్రజల వద్దకు వచ్చినదంతా నాకు వివరంగా చెప్పబడింది. కాబట్టి, నీవు చేసిన పనికి తగిన ప్రతిఫలమును యెహోవా నీకు దయ చేయును గాక, ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా రెక్కల కింద ఆశ్రయమునకు వచ్చిన నీకు ఆయన వల్ల పూర్ణమైన ప్రతిఫలము కలుగును గాక అన్నాడు. దానికి ఆమె నా ప్రభువా, నీ కళ్ళల్లో నాకు దయ కలుగును గాక. నేను నీ పనికత్తెలలో ఒకదానివంటి దానను కాకపోయినా, నీవు నాకు ఆదరణ మాటలు చెప్పి నీ దాసురాలితో దయగా మాట్లాడావని చెప్పింది.

## రొట్టె, ద్రాక్షారసము, వేయించిన సెనగలు (పేలాలు) ఇచ్చుట

### రూతు 2 : 14 - 23

భోజన సమయంలో బోయజు రూతును చూసి, నువ్వు ఇక్కడికే వచ్చి భోజనం చెయ్యి. నీ రొట్టెముక్కలను ద్రాక్షారసంలో ముంచుకుని తినమని చెప్పి, కోయువారి దగ్గర కూర్చోనిచ్చాడు. మరియు వేయించిన సెనగలు (పేలాలు) ఆమెకు ఇవ్వబడ్డాయి. ఆమె తిని, తృప్తి పొంది మిగిల్చెను. బోయజు తన పనివారిని చూసి, ఆమె పనల మధ్య ఏరుకోనివ్వండి, ఆమెను అవమానపరచవద్దు. ఆమె ఏరుకొనునప్పుడు, పనల మధ్య నుండి కొన్ని వెన్నులు కావాలనే విడిచిపెట్టండి, ఆమెను గద్దించవద్దు అని ఆజ్ఞాపించాడు. బోయజు రూతుతో మాట్లాడినది, ఇచ్చినది అంతా నయోమికి రూతు చెప్పగా, నయోమి రూతుతో, కోత ముగిసే వరకు నీవు వేరే పొలమునకు వెళ్ళకుండా, బోయజు పొలంలోనే ఏరుకోమని

చెప్పినట్లుగా చేస్తూ, నయోమితో కలిసి నివసించింది.

## నయోమి రూతుకు మేలు కలుగుటకు ఇచ్చిన సలహా

### రూతు 3 : 1 – 9

నయోమి రూతును చూసి, నా కుమారీ, నీవు సుఖంగా జీవించునట్లు నేను నీకు మేలు వెదకవద్దా? నీవు బోయజు పనికత్తెలతో కలిసి ఉన్నావు కదా, ఆ బోయజు మన సమీప బంధువు. ఆయన ఈ రాత్రి కళ్లంలో యవలను తూర్పారబడతాడు. నీవు స్నానము చేసి, నూనె రాసుకుని, నీ వస్త్రములు ధరించుకుని, ఆ కళ్లమునకు వెళ్ళు. ఆయన పడుకున్నప్పుడు ఆయన కాళ్ల మీద ఉన్న దుప్పటిని తీసి కాళ్ల యొద్ద పడుకో. అప్పుడు నీవు ఏమి చేయాలో ఆయన నీకు చెప్తాడు అని చెప్పింది. నయోమి సలహా ప్రకారం రూతు కళ్లమునకు వెళ్ళి, బోయజు పడుకున్న చోట, కాళ్ల దగ్గర దుప్పటిని తీసి కాళ్ల యొద్ద పడుకుంది. అర్ధరాత్రి వేళ, బోయజు ఉలికిపడి తిరిగి చూసి, ఒక స్త్రీ తన కాళ్ల దగ్గర పడుకొని ఉండటం చూసి, నీవు ఎవరవు అని అడగగా, ఆమె నేను నీ దాసురాలైన రూతును, నీవు నీ దాసురాలి మీద నీ కొంగు కప్పుము, నీవు విడిపించు బంధువువు అని రూతు చెప్పింది.

## బోయజు రూతును ఆశీర్వదించుట

### రూతు 3 : 10 – 12

నీవే నా విడిపించు బంధువువు అని చెప్పిన రూతును చూసి, బోయజు, నా కుమారీ, నీవు యెహోవా చేత దీవెన నొందిన దానవు, నీవు పేదవారిని గాని ఐశ్వర్యవంతులను గాని యవ్వనస్థులను వెంబడించలేదు గనుక, నీ మునుపటి సత్ప్రవర్తన కంటె వెనుకటి సత్ప్రవర్తన మరి ఎక్కువైనది. ఇప్పుడు భయపడకు నా కుమారీ, నీకు కావలసినవన్నీ

చేస్తాను. నీవు యోగ్యురాలవని నా ప్రజలందరికీ తెలుసు అని చెప్పి రూతును బోయజు ఆశీర్వదించాడు.

## బోయజు రూతును వివాహం చేసుకుంటానని చెప్పుట

### రూతు 3 : 13 – 18

బోయజు రూతును చూసి, ఈ రాత్రి ఇక్కడే ఉండు. నేను విడిపించు బంధువును అనేది నిజమే, అయితే నాకంటే దగ్గరి బంధువు ఒకడు ఉన్నాడు. రేపు ఆయన ధర్మబద్ధంగా ఒప్పుకుంటే, ఆయన నిన్ను వివాహం చేసుకోనివ్వు, లేకపోతే, నేను నిన్ను విడిపించు బంధువుగా వివాహం చేసుకుంటాను. తెల్లవారు వరకు ఆయన కాళ్ల దగ్గర పడుకో, కళ్లమునకు ఒక స్త్రీ వచ్చినట్లు తెలియకూడదు అని చెప్పినట్లుగా, తెల్లవారక ముందే ఆమె లేచి వెళ్ళింది. ఆమె తన అత్త వద్దకు వెళ్ళి జరిగిన విషయాలన్నీ వివరించింది. అప్పుడు ఆమె నా కుమారీ, ఇది ఎలా ముగుస్తుందో నీవు తెలుసుకొను వరకు వేచి ఉండు. ఆ మనుష్యుడు ఈ విషయాన్ని ముగించకుండా విశ్రమించడు అని చెప్పింది. ఈ విధంగా, మోయాబు స్త్రీ తన అత్తయైన నయోమికి లోబడి, ఆమె సలహా ప్రకారం నడచుకున్నందువల్ల, అన్యజనురాలైన రూతు గొప్ప ఐశ్వర్యవంతుడికి వధువు అయ్యేలా నయోమి ద్వారా నడిపించబడింది. ఇవి మనకు ఎటువంటి బోధను ఇస్తాయో వివరంగా చూద్దాం.

## రూతు చరిత్ర ఎక్కడ జరిగింది?

### రూతు 1 : 1

**న్యాయాధిపతులు ఏలిన దినములయందు దేశములో కరవు కలుగగా యూదా బేత్లెహేము నుండి ఒక మనుష్యుడు తన భార్యను తన యిద్దరు**

**కుమారులను వెంట బెట్టుకొని మోయాబుదేశమున కాపురముండుటకు వెళ్ళెను.**

దేవుడు ఇశ్రాయేలు ప్రజలను ఐగుప్తు బానిసత్వం నుండి విడిపించి, మోషే ద్వారా కనానుకు నడిపించాడు. ఈ రూతు చరిత్ర సుమారు క్రీ.పూ. 1250 సంవత్సరాలకు పూర్వం ఇశ్రాయేలీయుల దేశంలో న్యాయాధిపతులు న్యాయము తీర్చుచున్న దినములలో జరిగింది. ఆ రోజుల్లో ఇశ్రాయేలులో కరువు కలిగింది. అప్పుడు బెత్లెహేము ఊరివాడైన ఎలీమెలెకు తన భార్యతో, ఇద్దరు కుమారులతో కలిసి మోయాబు దేశానికి వెళ్ళి నివసించారు. ఇశ్రాయేలును న్యాయాధిపతులు సుమారు 3 5 0 సంవత్సరాలు పరిపాలించారు.

## దేశంలో కరువు కలుగుటకు కారణం?

**ఆమోసు 3 : 2**

**అదేమనగా భూమి మీది సకల వంశములలోను మిమ్మును మాత్రమే నేను ఎరిగియున్నాను గనుక మీరు చేసిన దోషక్రియలన్నిటిని బట్టి మిమ్మును శిక్షింతును.**

భూమి మీదున్న వంశాలన్నిటిలో ఇశ్రాయేలీయులను మాత్రమే దేవుడు తన కోసం ఎన్నుకున్నాడు గనుక, వారి దోషాలను బట్టి వారిని శిక్షిస్తాను అన్నాడు. దేవుడు మోషే ద్వారా ధర్మశాస్త్రాన్ని ఇచ్చాడు. ఆ శాస్త్రం ప్రకారం నడచుకుంటే ఆశీర్వదించబడతారు, నడచుకోకపోతే శపించబడతారు (**లేవీయకాండము 2 6 : 1 - 2 8** ). దీని ఆధారంగా, ఇశ్రాయేలీయుల తప్పిదాల వల్ల దేశంలో కరువు కలిగింది. ఆ రోజుల్లో ఇశ్రాయేలీయులు ఎవరికి తోచినట్లు వారు జీవించేవారు (**న్యాయాధిపతులు 21:25**). వారి తప్పిదాల వల్ల దేశంలో కరువును

దేవుడు పంపాడు. కాబట్టి, వీరి అవిధేయతే దేశంలో కరువు కలుగుటకు కారణమైంది.

## కరువు నుండి తప్పించుకొనే మార్గం ఏమిటి?

### 2 దినవృత్తాంతములు 7 : 13 – 14

**13 వాన కురియకుండ నేను ఆకాశమును మూసివేసినప్పుడే గాని, దేశమును నాశనము చేయుటకు మిడతలకు సెలవిచ్చినప్పుడే గాని, నా జనుల మీదికి తెగులు రప్పించినప్పుడే గాని,**

**14 నా పేరు పెట్టబడిన నా జనులు తమ్ముతాము తగ్గించుకొని ప్రార్థన చేసి నన్ను వెదకి తమ చెడు మార్గములను విడిచిన యెడల, ఆకాశము నుండి నేను వారి ప్రార్థనను విని, వారి పాపమును క్షమించి, వారి దేశమును స్వస్థపరచుదును.**

ఇశ్రాయేలీయులు దేవుడు ఇచ్చిన ఆజ్ఞలను మీరి పాపం చేసినప్పుడు వాన లేకుండా ఆకాశాన్ని మూసివేసినా లేదా దేశాన్ని నాశనం చేయాలని నిశ్చయించినా లేదా ప్రజల్లో తెగులు పంపినప్పుడు, దేవుని పేరు పెట్టబడిన ప్రజలు తమ్ముతాము తగ్గించుకుని, ప్రార్థన చేసి, తమ పాపాలను ఒప్పుకుని, తమ చెడ్డ మార్గాలను విడిచి తిరిగితే, వారి పాపాలను క్షమించి ఆ ఇబ్బంది నుండి వారిని విడిపిస్తాడు. ఈ విధంగా, ఇశ్రాయేలీయులు కరువు నుండి తప్పించుకునే మార్గాన్ని కూడా ఇచ్చాడు.

## ఎలీమెలెకు మరణించుటకు కారణం?

### ద్వితీయోపదేశకాండము 28 : 15

**నేను నేడు నీకాజ్ఞాపించు ఆయన సమస్తమైన ఆజ్ఞలను కట్టడలను నీవు అనుసరించి నడుచు కొనవలెనని నీ దేవుడైన యెహోవా సెలవిచ్చిన మాట**

**వినని యెడల ఈ శాపములన్నియు నీకు సంభవించును.**

దేవుడు తన ప్రజలుగా ఎన్నుకున్న ఇశ్రాయేలీయులకు ధర్మశాస్త్ర ఆజ్ఞలను ఇచ్చి, ఆ ఆజ్ఞల ప్రకారం నడచుకోకపోతే శాపాలు వచ్చి సంభవిస్తాయి అన్నాడు. దీనిని ఎరిగి ఉన్న ప్రజలు యెహోవా ఆజ్ఞలను విడిచి పెట్టి, ఆయన మాట విననందువల్ల దేశంలో కరువు కలిగింది. ఆ కరువు నుండి తప్పించుకోవడానికి తమ పాపాలను ఒప్పుకుని ప్రార్ధన చేస్తే కరువు నుండి తప్పించుకోవచ్చు. కానీ, దానిని విడిచి మోయాబుకు వెళ్ళినందున, శాస్త్రంలో చెప్పబడినట్లు ఎలీమెలెకు మరణించాడు.

## కుమారులు మరణించుటకు కారణం?

**ద్వితీయోపదేశకాండము 7 : 1 – 4**

**నీవు స్వాధీనపరచుకొనబోవు దేశములోనికి నీ దేవుడైన యెహోవా నిన్ను చేర్చి బహు జనములను,... నీ యెదుటనుండి వెళ్లగొట్టిన తరువాత ... వారితో నిబంధన చేసికొనకూడదు, వారిని కరుణింపకూడదు, నీవు వారితో వియ్యమందకూడదు, వాని కుమారునికి నీ కుమార్తె నియ్యకూడదు, నీ కుమారునికి వాని కుమార్తెను పుచ్చుకొనకూడదు. నన్ను అనుసరింపకుండ ఇతర దేవతలను పూజించునట్లు నీ కుమారుని వారు మళ్లించుదురు, అందును బట్టి యెహోవా కోపాగ్ని నీ మీద రగులుకొని ఆయన నిన్ను త్వరగా నశింపజేయును.**

దేవుడు ఇశ్రాయేలీయులకు ఇచ్చిన ఆజ్ఞ ఏమనగా, అన్యజనులలో పెళ్లి సంబంధాలు పెట్టుకోకూడదు. కానీ, ఎలీమెలెకు మరణించిన తర్వాత, దేవుడు వారించిన అన్యజనులైన మోయాబు స్త్రీలను తన ఇద్దరు కుమారులకు వివాహం చేసినందున, ఇద్దరు కుమారులు చనిపోయారు. ఎందుకంటే, ఇప్పటికే దేవుడు వారించిన జాతులతో సంబంధం కలిపితే

మీరు నశించిపోతారని చెప్పి ఉన్నాడు. కానీ, ఇద్దరు కుమారులు మోయాబు స్త్రీలను వివాహం చేసుకున్నారు. మోయాబు వారు దేవునికి ఎందుకు అసహ్యులయ్యారంటే, సొదొమ గొమొర్రా పాపమును బట్టి ఆయన వాటిని నాశనం చేశాడు. అక్కడ ఉన్న లోతు యెహోవా చేత తప్పించబడ్డాడు. ఆయన తప్పించుకుని వెళ్ళిన దేశంలో ప్రజలు లేనందున, తన ఇద్దరు కుమార్తెలు తమకు సంతానం కలగాలని ప్రయత్నించి, తమ తండ్రికి మద్యమును ఇచ్చి, తమ తండ్రి ద్వారా పిల్లలను కన్నారు. ఇవి దేవుని దృష్టిలో అసహ్యమైనవి. ఇందులో పెద్దది కనిన కుమారునికి మోయాబు అని, చిన్నది కనిన కుమారునికి అమ్మోను అని పేరు పెట్టారు (**ఆదికాండము 19:30-38**). ఈ మోయాబీయులకు చెందిన జనాంగంలోనే ఎలీమెలెకు ఇద్దరు కుమారులు వివాహం చేసుకున్నారు. ఇది యెహోవాకు అసహ్యము. కాబట్టి, వారు యెహోవా ఆజ్ఞలకు లోబడనందువల్ల మరణించారు.

## రూతు చరిత్ర ఎందుకు వ్రాయబడింది?

**రోమీయులకు 15 : 4**

**ఏలయనగా ఓర్పు వలనను, లేఖనముల వలని ఆదరణ వలనను మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వమందు వ్రాయబడినవన్నియు మనకు బోధ కలుగు నిమిత్తము వ్రాయబడి యున్నవి.**

**1 కొరింథీయులకు 10 : 11**

**ఈ సంగతులు దృష్టాంతములుగా వారికి సంభవించి, యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెను.**

**హెబ్రీయులకు 10 : 1**

**ధర్మశాస్త్రము రాబోవుచున్న మేలుల ఛాయ గలదియే గాని ఆ వస్తువుల**

## నిజస్వరూపము గలదికాదు...

బైబిలులో పూర్వం వ్రాయబడిన వచనాల వల్ల కలిగే ఓర్పు ద్వారా, ఆదరణ ద్వారా మనం నిరీక్షణ గలవారమగునట్లు, ఇవి బోధలుగాను, ఈ అంత్య కాలంలో ఉన్న మనకు హెచ్చరిక కలుగునట్లు వ్రాయబడిన మాదిరి గాను, రాబోవు మేలుల నీడగాను ఉన్నాయి. కాబట్టి, ఈ రూతు చరిత్ర మనకు ఏమి వెల్లడిస్తుందంటే, దేవుడు అసహ్యించుకున్న వారిని కూడా ఆయన త్రోసివేయకుండా, వారు కూడా క్రీస్తు వధువు అగునట్లు చిత్తము కలిగి తన ప్రణాళిక ప్రకారం అందరి పట్ల కనికరము చూపుటకు, అన్యజనుల నుండి ఒక తరగతి వారిని ఎన్నుకోవాలని దేవుడు చిత్తము కలిగి ఉన్నాడని వెల్లడించుటకు రూతు చరిత్ర ఒక నీడగా వ్రాయబడింది.

## ఆహారం ఇచ్చుట దేనిని సూచిస్తుంది?

## రూతు 1 : 6

### వారికి ఆహారమిచ్చుటకు యెహోవా తన జనులను దర్శించెనని ...

యెహోవా తన ప్రజలను దర్శించి వారికి ఆహారం ఇచ్చాడు అనగా, దేవుడు తాను ఎన్నుకున్న వారి అవిధేయత వల్ల విడిచిపెట్టబడి దూరమైపోయిన ఇశ్రాయేలీయులను దేవుడు మరల దర్శించి, తన ఆహారమైన వాక్యమును వారికి ఇచ్చాడు (**యిర్మీయా 15:16; మత్తయి 4:4**). ఇవి దేనిని సూచిస్తాయంటే, మలాకీ ప్రవక్త కాలం తర్వాత సుమారు 400 సంవత్సరాలు దేవుడు వారితో మాట్లాడకుండా మౌనంగా ఉన్నాడు. కానీ, దేవుడు మానవజాతిపై ఉన్న ప్రేమను వెల్లడించడానికి, తన ఏకైక కుమారుడైన యేసును ఈ భూమికి పంపి, పరలోక రాజ్య పిలుపును మొదట ఇశ్రాయేలు ప్రజలకు ఇచ్చాడు (**మత్తయి 10:5-7**). ఇదే యెహోవా తన ప్రజలను దర్శించి ఆహారం ఇచ్చాడు అని సూచిస్తుంది.

## యూదాకు నడిపించుట దేనిని సూచిస్తుంది?

### రూతు 1 : 7

**అప్పుడు ఆమె యున్న స్థలము నుండి ఆమెతో కూడ ఆమె యిద్దరు కోడండ్రును బయలుదేరి యూదా దేశమునకు తిరిగి పోవలెనని మార్గమున**

నయోమి, యెహోవా తన ప్రజలను దర్శించి వారికి ఆహారం ఇచ్చాడని విన్నందున, తన ఇద్దరు కోడళ్లు ఓర్పా మరియు రూతులతో కలిసి యూదా దేశానికి వెళ్ళడానికి, రొట్టెల ఇళ్ళు అయిన బెత్లెహేమునకు నయోమి ద్వారా నడిపించబడ్డారు. ఇవి దేనిని సూచిస్తాయంటే, దేవుని చేత ఎన్నుకోబడిన ఇశ్రాయేలీయులకు ఆహారమైన సువార్త ప్రకటించబడుతోంది. దానిని రూతు, ఓర్పా అనే మోయాబు అన్యజనులు కూడా వింటున్నారు. ఈ విధంగా, **అన్యజనులు దేవుడు లేని స్థితి నుండి దేవునితో చేరుటకు నయోమి అనే సత్యము ద్వారా, యూదయ రొట్టెల ఇళ్ళు అయిన బెత్లెహేము వైపు నడిపించబడటమే,** యూదయకు తిరిగి వెళ్ళుటకు వారు నడిపించబడటాన్ని సూచిస్తుంది.

## తల్లి ఇంటికి వెళ్ళుట దేనిని సూచిస్తుంది?

### రూతు 1 : 8 – 9

**నయోమి తన యిద్దరు కోడండ్రను చూచిమీరు మీ తల్లుల యిండ్లకు తిరిగి వెళ్లుడి;..**

నయోమి తన కోడళ్లు ఇద్దరిని చూసి, మీరు మీ తల్లి ఇంటికి తిరిగి వెళ్ళండి అనడం, **తమ పాత స్థితికి తిరిగి వెళ్ళటాన్ని** సూచిస్తుంది. అక్కడ మీరు సుఖంగా ఉండండి అని చెప్పడం దేనిని సూచిస్తుందంటే, తమ తల్లి ఇళ్ళు అయిన పాత స్థలానికి వెళ్ళి, **తమ ఇష్టానుసారంగా జీవించి,**

**లోకంతో కలిసి, వారి ద్వారా వచ్చే లోక మేలులను అనుభవించడమే** భర్త ఇంట సుఖంగా ఉండటాన్ని సూచిస్తుంది. యెహోవా మీ పట్ల దయ చూపుతాడు అనడం దేనిని సూచిస్తుందంటే, **సాధారణ రక్షణ అయిన మూడవ కోతలో ప్రవేశించడమే** దీని అర్థం. మీరు ఈ లోకంలో సుఖంగా జీవించాలంటే, మీ తల్లి ఇంటికి తిరిగి వెళ్ళండి అని చెప్పడంలోని ఉద్దేశ్యం ఇదే. కానీ, క్రీస్తును వెంబడించే వారికి శ్రమలు, వేదనలు ఉంటాయి. వీరు తమ జీవితంలో విధవరాండ్ర వలె ఎటువంటి సుఖము అనుభవించక ఒంటరి స్థితిలో కనిపిస్తారు. కాబట్టి, క్రీస్తును వెంబడించుటకు ఎవరిని నిర్బంధించడం లేదు, ఒకడు నన్ను వెంబడింపగోరిన యెడల, తన్ను తాను ఉపేక్షించుకొని తన సిలువను ఎత్తికొని నన్ను వెంబడింపవలెను (**మత్తయి 16:24**). ఈ వచనం ఆధారంగా, ఒకరు క్రీస్తును వెంబడించాలంటే మనఃపూర్వకంగా వెంబడించాలి.

## నీతోనే వస్తాము అనడం దేనిని సూచిస్తుంది?

### రూతు 1 : 10

**అంతట వారు ఎలుగెత్తి యేడ్చి నీ ప్రజల యొద్దకు నీతో కూడ వచ్చెదమని ఆమెతో చెప్పగా**

నీ ప్రజల వద్దకు నీతో కూడ వస్తాము అనడం, సత్యాన్ని విన్న **ప్రారంభ రోజులలో సత్యంపై ఉన్న వాంఛ వల్ల కలిగే ఒక ఉత్సాహాన్ని** సూచిస్తుంది. దీనినే, నీ ప్రజల వద్దకు నీతో కూడ వస్తాము అనడం సూచిస్తుంది. ఈ విధంగా, అన్యజనులలో సువార్త ప్రకటించబడినప్పుడు, వినేవారు దానిని ఎంతో సంతోషంగా అంగీకరిస్తారు. సత్యాన్ని మేము వెంబడిస్తాము అనే ప్రారంభ స్థితిలో ఉన్న నిశ్చయతనే నీతో వస్తాము అనడం సూచిస్తుంది.

## ఓర్పా ముద్దు పెట్టుకుని వెళ్ళడం దేనిని సూచిస్తుంది?

### రూతు 1 : 11 – 14

**...మీరు వారికొరకు కనిపెట్టుకొని పురుషులు లేక యొంటరి కత్తెలై యుందురా? ... ఓర్పాతన అత్తను ముద్దుపెట్టుకొనెను,....**

నయోమి తన కోడళ్లను మరల చూసి, నా వల్ల మీకు ఎటువంటి మేలు కలుగదు. ఇకపై నా నుండి మీకు ఎటువంటి ప్రయోజనం ఉండదు. మరియు మీరు ఒంటరిగా నిలబడే స్థితి ఏర్పడినందున, ఎటువంటి సుఖము అనుభవించలేరు గనుక, ఈ లోక భోగాలను అనుభవించలేరని నయోమి మరల చెప్పిన మాట విని ఓర్పా, తన అత్తయైన నయోమిని ముద్దు పెట్టుకుని వెళ్ళిపోయింది. ఇవి దేనిని సూచిస్తాయంటే, నయోమి అనే సత్యము బోధించబడినప్పుడు వినే అన్యజనులలో ఓర్పా వంటి వారు **సత్యం చాలా బాగుందని పొగిడి, కానీ దానిని పాటించడం చాలా కష్టం** అని భావిస్తారు. **దీనివల్ల, లోక భోగాలను ఏవీ అనుభవించలేమని గ్రహించి, తమ పాత స్థలమైన తల్లి ఇంటికి తిరిగి వెళ్ళిపోవడమే ముద్దు పెట్టుకుని వెళ్ళడాన్ని** సూచిస్తుంది.

కానీ, ఈ సువార్త యేసు పరిచర్య రోజుల్లో, **యోహాను 6:59-66** లో చెప్పబడిన సత్యాన్ని విన్న వారిలో అనేకులు సత్యాన్ని గైకొనుట కష్టమని చెప్పి, ఆయనను విడిచి వెళ్ళిపోయారు. అదే విధంగా, అన్యజనులలో సత్యాన్ని వినే ఓర్పా వంటి కొందరు, ఆ సత్యం ఆధారంగా నడవకుండా వెనక్కి వెళ్ళిపోయిన వారు. వీరు ఓర్పా వలె సత్యాన్ని వాంఛతో విన్నా, దాని ఆధారంగా జీవించడానికి ఇష్టపడకపోవడానికి కారణం ఏమిటంటే, తండ్రి అనుగ్రహిస్తే తప్ప ఎవడును యేసుక్రీస్తు వద్దకు రాలేడు **(యోహాను 6:44)**.

దీని ఆధారంగా, సత్యం విన్నా క్రీస్తును నిరంతరం వెంబడించక వెనుదిరిగి వెళ్ళడమే ఓర్పా ముద్దు పెట్టుకుని వెళ్ళడాన్ని సూచిస్తుంది. ఓర్పా అనగా జింక.

## రూతు హత్తుకోవడం దేనిని సూచిస్తుంది?

**రూతు 1 : 14 – 17**

**... రూతు ఆమెను హత్తుకొనెను ...**

నా వల్ల మీకు ఎటువంటి మేలు కలుగదు. కాబట్టి, నీవు నీ తోటి కోడలైన ఓర్పా వెళ్ళినట్లు వెళ్ళిపో అని చెప్పినా, దానిని రూతు లెక్కచేయక, అత్తను విడువక హత్తుకుంది. ఇది దేనిని సూచిస్తుందంటే, **నిజమైన సత్యం ద్వారా నడిపించబడిన అన్యజనులలో ఒక తరగతి వారు సత్యం వినే దేవుని చేత ఎన్నుకోబడిన నిజమైన సంఘ తరగతిని** సూచిస్తారు. వీరిని చూసి మీరు కూడా వెళ్ళిపోవాలని అనుకుంటున్నారా? అని అడిగినప్పుడు, నిత్యజీవపు మాటలు నీ వద్దనే ఉన్నాయి కదా. మేము ఎవరి వద్దకు వెళ్తాము (**యోహాను 6:67-69**) అని అనిన శిష్యుల వలె, ఈ రూతు ప్రకటించబడే సత్యానికి చెవి యొగ్గి, దానివల్ల వచ్చే ఎటువంటి శ్రమల గురించి చింతించక, ఈ లోక ఆశలను అసహ్యించుకుని శ్రమలను అనుభవించడానికి ఇష్టపడతారు (**2 తిమోతి 2:12**). వీరు క్రీస్తు నాకు జీవమైతే మరణము నాకు లాభము (**ఫిలిప్పీయులకు 1:21**) అని చెప్పి, ఎల్లప్పుడూ  క్రీస్తునే వెంబడించేవారిగా ఉంటారు (**ప్రకటన 14:4**). రూతు అనగా రోజా లేదా ప్రియమైనది.

## యూదయలో కోత దేనిని సూచిస్తుంది?

**రూతు 1 : 22**

**అట్లు నయోమియు ఆమెతో కూడ మోయాబీయురాలైన రూతు అను ఆమె**

**కోడలును మోయాబుదేశము నుండి తిరిగి వచ్చిరి. వారిద్దరు యవలకోత ఆరంభములో బేత్లెహేము చేరిరి.**

నయోమి అనే సత్యము, అన్యజనులలో రూతు వంటి తరగతి వారు వధువు అగునట్లు పిలవబడినవారు, రొట్టెల ఇళ్ళు అయిన బెత్లెహేమునకు వచ్చేటప్పుడు, అక్కడ మొదటి కోత యూదుల మధ్య జరుగుతున్న కాలమై ఉంది (**యోహాను 4:35**). ఆ రోజుల్లో యూదులు క్రీస్తు కోతలో చేర్చబడుటకు, తమను తాము సమర్పించుకోక కలహం చేసి దూషించినందున, ఈ అవకాశం అన్యజనులకు వచ్చింది (**అపొస్తలుల కార్యములు 13:26, 45-48**). కాబట్టి, మొదటి కోత ముగింపులో అన్యజనులకు సత్యం అందడం ప్రారంభమైంది. దీనినే, రూతుతో కలిసి నయోమి మోయాబు దేశం నుండి తిరిగి వచ్చేటప్పుడు కోత ప్రారంభంలో రొట్టెల ఇళ్ళు అయిన బెత్లెహేమునకు రావడాన్ని సూచిస్తుంది.

## బోయజు ఎవరిని సూచిస్తాడు?

### రూతు 2 : 1

**నయోమి పెనిమిటికి బంధువు డొకడుండెను. అతడు చాల ఆస్తిపరుడు, అతడు ఎలీమెలెకు వంశపువాడై యుండెను, అతని పేరు బోయజు.**

ఎలీమెలెకు బంధువు బోయజు. ఈ బోయజు ఎవరిని సూచిస్తాడంటే, తండ్రియైన దేవుని ఏకైక కుమారుడిని సూచిస్తాడు. ఆయన సంబంధం **ఆమోసు 3:2** ప్రకారం ఇశ్రాయేలీయులను మాత్రమే దేవుడు తన కోసం ఎన్నుకున్నాడు. వారిలో పుట్టినవాడే యేసు (**రోమీయులకు 9:5**). ఇదే ఎలీమెలెకు బంధువు బోయజు యేసును సూచిస్తుంది. ఆయన అతిపెద్ద ఐశ్వర్యవంతుడు. ఎలాగంటే, తండ్రియైన దేవునికి చెందిన సమస్తం ఆయన ఏకైక కుమారుడికే ఇచ్చాడు. కాబట్టి, బోయజు అనే అతిపెద్ద

ఐశ్వర్యవంతుడు యేసును సూచిస్తాడు.

## బోయజు పొలం దేనిని సూచిస్తుంది?

**రూతు 2 : 2 – 3**

**2 మోయాబీయురాలైన రూతు నీ సెలవైన యెడల నేను పొలములోనికి**
**పోయి, యెవని కటాక్షము పొందగలనో వాని వెనుక పరిగె నేరుకొందునని**
**నయోమితో చెప్పగా ఆమె నా కూమారీ పొమ్మనెను.**
**3 కాబట్టి ఆమె వెళ్లి పొలములోనికి వచ్చి చేను కోయువారి వెనుక**
**పొలములో ఏరుకొనెను. ఆ పొలములో ఆమె పోయిన భాగము ఎలీమెలెకు**
**వంశపువాడైన బోయజుది.**

రూతు పొలంలో వెన్నులు ఏరుకోవడానికి వెళ్ళడం, రూతు అనే అన్యజనులు సత్యాన్ని వినాలని ఉన్న వాంఛను సూచిస్తుంది. బోయజు పొలం దేనిని సూచిస్తుందంటే, సత్య వాక్యము పలికే ప్రజలను సూచిస్తుంది. ఈ విధంగా, సత్యం వినాలని వాంఛ ఉన్నవారు వినడానికి వెళ్ళి చేరిన పొలం – అనుకోకుండా లభించిన బోయజు పొలం. ఈ బోయజు యేసుక్రీస్తుకు గుర్తు. కాబట్టి, యేసుక్రీస్తు సత్యం ఇశ్రాయేలీయులకు ఇవ్వబడింది. ఆ సత్యం అన్యజనులకు వారి ద్వారా ఇవ్వబడింది. అందువల్ల, బైబిలు వాక్యంపై నిజమైన వాంఛ ఉన్నవారు ఎవరైనా సరే, ఏ స్థితిలో ఎక్కడ ఉన్నా సరే, వారికి సత్యం క్రీస్తు ప్రజల ద్వారా నిశ్చయంగా లభిస్తుందని, అది మనం ఆశించని సమయంలో లభిస్తుందని దీని ద్వారా తెలుసుకోవచ్చు. కాబట్టి, బోయజు పొలం అనగా, ప్రభువైన యేసుక్రీస్తు సత్యాన్ని చెప్పే నిజాయితీ పరులను సూచిస్తుంది.

## యింట కూర్చుంది దేనిని సూచిస్తుంది?

**రూతు 2 : 5 – 7**

**5 అప్పుడు బోయజు కోయు వారి మీద ఉంచబడిన తన పనివానిని చూచి–ఈ చిన్నది ఎవరిదని అడుగగా**

**6 కోయు వారి మీద నుంచబడిన ఆ పనివాడు– ఈమె మోయాబుదేశము నుండి నయోమితో కూడ తిరిగి వచ్చిన మోయాబీయురాలైన యౌవనురాలు.**

**7ఆమె–నేను కోయువారి వెనుకకు పనలమధ్యను ఏరుకొని కూర్చుకొనుటకు దయచేసి నాకు సెలవిమ్మని అడిగెను. ఆమె వచ్చి ఉదయము మొదలుకొని యిది వరకు ఏరుకొను చుండెను, కొంతసేపు మాత్రము ఆమె యింట కూర్చుండెనని వాడు చెప్పెను.**

పొలం యజమానియైన బోయజు కోత కోయువారి పైవిచారణకర్తను చూసి, ఈ అమ్మాయి ఎవరి కుమార్తె అని అడగగా, ఆమె నయోమితో వచ్చిన మోయాబు యౌవనురాలు అని చెప్పాడు. ఇవి దేనిని సూచిస్తాయంటే, నయోమి అనే సత్య వాక్యం ద్వారా నడిపించబడిన అన్యజనుల నుండి వచ్చిన నిజమైన సంఘ తరగతిని సూచిస్తాయి. ఆమె కోయువారి వెనుక పడి వెన్నులు ఏరుకుంటాను అని అడగడం దేనిని సూచిస్తుందంటే, సత్యం ద్వారా నడిపించబడి వచ్చిన రూతు వంటి సంఘ తరగతి ఇశ్రాయేలీయులైన దేవుని ప్రజలకు చెప్పబడిన సత్య వాక్యంపై ఉన్న ఆసక్తిలో, దానిని తెలుసుకోవాలనే వాంఛ ఏరుకుంటాను అని అడగడాన్ని సూచిస్తుంది. దీని గురించి, యేసుక్రీస్తు పరిచర్య రోజుల్లో అన్యజనురాలైన కనాను స్త్రీతో మాట్లాడిన దాని గురించి చూద్దాం. యేసు వద్దకు అన్యజనురాలైన కనాను స్త్రీ వచ్చి, నా కుమార్తె దయ్యము పట్టి క్రూరమైన వేదన పడుతోంది. నీవు ఆమెపై కనికరము చూపాలి అని అడిగింది. దానికి ఆయన పిల్లల రొట్టె తీసుకుని కుక్కపిల్లలకు వేయడం యుక్తం కాదు అని చెప్పగా, ఆమె నిజమే ప్రభువా, బల్ల మీద నుండి పడే ముక్కలను

కుక్కపిల్లలు తింటాయి కదా అని చెప్పడం, అన్యజనులలో సత్యంపై ఉన్న వాంఛను వెల్లడిస్తుంది **(మత్తయి 15:22-28)**. ఈ విధంగా, ఇశ్రాయేలీయులకు ఇవ్వబడిన సత్యం రాలిన దానిని ఏరుకోవడానికి అన్యజనులకు ఇవ్వబడింది. ఇవి రాలి సుమారు 2000 సంవత్సరాలు అయ్యింది. కానీ, ఇక్కడ ఇంటిలోకి వచ్చి కొద్ది సేపయ్యింది అని ఉంది. ఇది దేనిని సూచిస్తుందంటే, ఇప్పుడు సత్యం వింటున్న మన గురించి చెప్పబడింది. రాలినదే ఇంత అద్భుతంగా ఉంటే, చేర్చబడేది ఇంకెంత అద్భుతంగా ఉంటుందోనని.

## వేరే పొలాలకు ఎందుకు వెళ్ళకూడదు?

### రూతు 2 : 8 – 9

**8 అప్పుడు బోయజు రూతుతో నా కుమారీ, నా మాట వినుము; వేరొక పొలములో ఏరుకొనుటకు పోవద్దు, దీనిని విడిచి పోవద్దు, ఇచ్చట నా పనికత్తెల యొద్ద నిలకడగా ఉండుము.**

**9 వారు కోయు చేను కనిపెట్టి వారిని వెంబడించుము, నిన్ను ముట్టకూడదని యౌవనస్థులకు ఆజ్ఞాపించియున్నాను, నీకు దాహమగునప్పుడు కుండల యొద్దకు పోయి పనివారు చేదిన నీళ్లు త్రాగుమని చెప్పెను.**

బోయజు రూతును చూసి, నా కుమారీ, వెన్నులు ఏరుకొనుటకు వేరే పొలాలకు వెళ్ళవద్దు, దీనిని విడిచి వెళ్ళవద్దు, ఇక్కడే నా పనికత్తెలతో ఉండు అన్నది దేనిని సూచిస్తుందంటే, **సత్యం వినడానికి బోయజు పొలమైన క్రీస్తు వద్ద మాత్రమే వినాలి. మరే చోటా సత్యం లేదు.** కాబట్టి, **సత్యం చెప్పే క్రీస్తు నిజమైన సహోదరులతో సంబంధం కలిగి ఉండాలి** అని సూచిస్తుంది. ఎవరూ నిన్ను ముట్టకుండా పనివారికి ఆజ్ఞాపించాను అన్నది

దేనిని సూచిస్తుందంటే, నిజమైన సత్యాన్ని వింటున్న దేవుని చేత **అనుమతించబడిన ఆయన బిడ్డలకు దేవుడు ఇచ్చే రక్షణను** ఇది సూచిస్తుంది. నీకు దప్పిక వేస్తే పనివారు ముంచి తెచ్చిన దానిలో తాగవచ్చు అన్నది దేనిని సూచిస్తుందంటే, **సత్యం వినాలనే ఆసక్తిలో వచ్చే ప్రశ్నలకు ఇతరులెవరితోనూ సమాధానం వెదకకుండా సత్యం ద్వారా నడిపించే ప్రజలతో కలిసి వారితోనే సమాధానాన్ని అడిగి తెలుసుకోవాలి** అనేదే పనివారు ముంచి తెచ్చే దానిలో తాగడాన్ని సూచిస్తుంది. కాబట్టి, ఏరుకోవడానికి వేరే ఏ పొలమునకు వెళ్ళవద్దు అన్నది **సత్యాన్ని విడిచి వెళ్ళకూడదు** అని సూచిస్తుంది.

## బోయజు రూతును ఆశీర్వదించుట

### రూతు 2 : 11 - 12

**11 నీవు నీ తలిదండ్రులను నీ జన్మభూమిని విడిచి, యింతకుముందు నీవు ఎరుగని జనము నొద్దకు వచ్చితివి.**

**12 యెహోవా నీవు చేసినదానికి ప్రతిఫలమిచ్చును; ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా రెక్కల క్రింద సురక్షితముగా నుండునట్లు నీవు వచ్చితివి; ఆయన నీకు సంపూర్ణమైన బహుమాన మిచ్చునని ఆమెకుత్తర మిచ్చెను.**

బోయజు రూతును చూసి, నీ భర్త మరణించిన తర్వాత నీవు నీ అత్తకు చేసినది, నీ తండ్రిని, తల్లిని, నీ జన్మదేశాన్ని విడిచి, మునుపు తెలియని ప్రజల వద్దకు వచ్చినదంతా నాకు తెలియబడింది. ఇది దేనిని సూచిస్తుందంటే, **సత్యం నిమిత్తం లోకం ద్వారా విడిచిపెట్టబడి తన తండ్రిగా, తల్లిగా** ఉన్న పూర్వపు సంఘాలను విడిచి, సత్యంపై ఉన్న వాంఛతో, సత్యం ద్వారా ఎన్నుకోబడిన సహోదరులతో

**చేరిపోవడాన్ని** ఇది సూచిస్తుంది. ఇటువంటి త్యాగము సత్యం కోసం అన్నిటినీ విడిచిపెట్టి రావడమే అత్త అనే సత్యానికి చేసిన మేలు. కాబట్టి, **తన పనికి తగిన ప్రతిఫలమును దేవుడు ఇస్తాడని,** యెహోవా రెక్కల కింద ఆశ్రయమునకు వచ్చినందువల్ల ఆయన వల్ల పూర్ణమైన ప్రతిఫలము ఉందని చెప్పడం, రూతు వలె సత్యం కోసం లోకసంబంధమైన అన్ని బంధాలను, తల్లిదండ్రుల వంటి తల్లి సంఘాల మేలులను విడిచి వచ్చిన నిజమైన సంఘము క్రీస్తు ద్వారా దేవుని ఆశీర్వాదం పొందుతుంది. ఈ విధంగా, **యేసు సంఘముగా ఎన్నుకోబడిన వారిని ఆశీర్వదించడమే** బోయజు రూతును ఆశీర్వదించడాన్ని సూచిస్తుంది.

## వేయించిన సెనగలు (పేలాలు) దేనిని సూచిస్తాయి?

### రూతు 2 : 14

**బోయజు భోజనకాలమున నీ విక్కడికి వచ్చి భోజనము చేసి, చిరకలో నీ ముక్క ముంచి, తినుమని ఆమెతో చెప్పగా, చేను కోయు వారి యొద్ద ఆమె కూర్చుండెను. అతడు ఆమెకు పేలాలు అందియ్యగా ఆమె తిని తృప్తిపొంది కొన్ని మిగిల్చెను.**

బోయజు భోజన సమయంలో రూతును చూసి, ఈ రొట్టె తిని, ఈ చిరకలో (ద్రాక్షారసము) ముంచుకో అని చెప్పి, వేయించిన సెనగలు కూడా ఇవ్వడం దేనిని సూచిస్తుందంటే, **తనను సత్యం కోసం అర్పించుకుని వచ్చిన సంఘానికి ఇవ్వబడిన రొట్టె సత్యాన్ని, ద్రాక్షారసము యేసు శ్రమలలో పాలుపొందే భాగ్యాన్ని,** వేయించిన సెనగలు అనగా **బైబిలు సత్యాలను వండడం లేక విభజించి బోధించబడటాన్ని, ఇక్కడ కొంచెం అక్కడ కొంచెం ఉన్న వచనాలను దేవుని ప్రణాళికకు అనుగుణంగా కలిపి**

**బోధించడమే** వేయించిన సెనగలను సూచిస్తుంది. ఈ విధంగా, అన్యజనులమైన రూతు తరగతి వారమైన మనకు ఒకే రొట్టె అయిన క్రీస్తు వాక్యాన్ని విశ్వసించడమే కాక, రొట్టె అయిన సత్యం నిమిత్తం శ్రమపడటానికి కూడా అనుగ్రహించబడింది (**ఫిలిప్పీయులకు 1:29**). ఇది రొట్టెను ద్రాక్షారసంలో (చిరకలో) ముంచుకోవడాన్ని సూచిస్తుంది.

## కోత దేనిని సూచిస్తుంది?

**రూతు 2 : 23**

**కాబట్టి యవలకోతయు గోధుమల కోతయు ముగియు వరకు ఆమె యేరుకొనుచు బోయజు పనికత్తెల యొద్ద నిలకడగా నుండి తన అత్త యింట నివసించెను.**

యవల మరియు గోధుమ కోత దేనిని సూచిస్తుందంటే, యవల మరియు గోధుమ కోత అనగా **ఇశ్రాయేలీయుల మధ్య జరిగిన మొదటి కోతను (యోహాను 4:35)** మరియు **అన్యజనుల మధ్య జరిగే రెండవ కోతను** సూచిస్తుంది (**మత్తయి 13:36-40**). ఈ రెండు కోతలలో చేర్చబడిన గింజలే వధువుగా కనిపిస్తారు. యవల మరియు గోధుమ అనే రెండు కోతలు ముగిసే వరకు, అత్తయైన నయోమి వద్ద రూతు ఉండటం దేనిని సూచిస్తుందంటే, **సత్యం ద్వారా నడిపించబడి మంచి గింజలుగా అంతం వరకు నిలకడగా ఉండటాన్ని** సూచిస్తుంది (**మార్కు 13:13**). ఈ విధంగా, అంతం వరకు సత్య వాక్యానికి లోబడి మంచి గింజలుగా కొట్టులో చేర్చబడటమే యవల మరియు గోధుమ కోత.

## నయోమి రూతుకు వెదికిన మేలు ఏమిటి?

**రూతు 3 : 1 – 4**

**1 ఆమె అత్తయైన నయోమి నా కుమారీ, నీకు మేలు కలుగునట్లు నేను నీ**

**కొరకు విశ్రాంతి విచారింపవలసిన దానను గదా.**
**2 ఎవని పనికత్తెల యొద్ద నీవు ఉంటివో ఆ బోయజు మనకు బంధువుడు.**
**ఇదిగో యీ రాత్రి అతడు కళ్లమున యవలు తూర్పార**
**బట్టింపబోవుచున్నాడు.**
**3 నీవు స్నానము చేసి తైలము రాచుకొని నీ బట్టలు కట్టుకొని ఆ**
**కళ్లమునకు వెళ్లుము; ... 4 ... అతని కాళ్లమీద నున్న బట్ట తీసి**
**పండుకొనవలెను; నీవు చేయవలసిన దానిని అతడు నీకు**
**తెలియజేయునని ఆమెతో అనగా**

అత్తయైన నయోమి రూతును చూసి, నా కుమారీ, నీవు సుఖంగా ఉండటానికి మేలు వెదకవద్దా? అన్నది దేనిని సూచిస్తుందంటే, రూతు అనే వధువు తరగతిలో సత్యం ద్వారా పిలవబడిన సంఘానికి, బోయజు అనే క్రీస్తు వధువు అగుటకు, **నయోమి అనే సత్య వాక్యము రూతు అనే అన్యజనులు బోయజు అనే యేసుక్రీస్తుకు వధువు అగునట్లు నడిపించడమే** మేలు వెదకడాన్ని సూచిస్తుంది. ఈ మేలును పొందుకోవడానికి నయోమి అనే సత్యము ద్వారా చెప్పబడే సలహా ఏమిటో ఇప్పుడు చూద్దాం. ఈ రాత్రి కళ్లంలో యవలను తూర్పారబడతాడు అంటే, **యూదుల మధ్య మొదటి కోత కాలంలో, అన్యజనులు వధువు అగుటకు పిలవబడ్డారు.** వారు వధువు అవ్వాలంటే, రాత్రి **అనే సువార్త కాలంలో, నయోమి అనే సత్య వాక్యము చెప్పే సలహాలకు లోబడాలి.** ఇవి ఈ సువార్త కాలంలో (రాత్రి వేళ) ముగించాలి. అవేమిటంటే, స్నానము చేసి, నూనె రాసుకుని, వస్త్రములు ధరించి, కాళ్ల దగ్గర పడుకోవడం.

- **స్నానము చేసి:** ఇది బాప్తిస్మ నిబంధనను సూచిస్తుంది. **రోమీయులకు 6:2-4; 1 పేతురు 3:21**.

- **నూనె రాసుకుని:** ఇది పరిశుద్ధాత్మను పొంది సత్య వాక్యంలో నడిపించబడటాన్ని సూచిస్తుంది. **కీర్తనలు 45:7; 133:1-2; 1 కొరింథీయులకు 6:11.**

- **వస్త్రములు ధరించుట:** ఇది దేవుని ద్వారా ఇవ్వబడే రక్షణ వస్త్రమైన నీతి వస్త్రము ధరించడాన్ని సూచిస్తుంది. **యెషయా 59:17; 61:10.**

- **కాళ్ల దగ్గర పడుకోవడం:** ఇది క్రీస్తు పాదాల వద్ద లోబడి నేర్చుకోవడాన్ని సూచిస్తుంది. **అపొస్తలుల కార్యములు 22:3.**

ప్రాథమిక సత్యాన్ని విని దాని ప్రకారం రూతు వలె లోక ఆశలన్నీ విడిచి సత్యానికి మాత్రమే లోబడి, బోయజు అనే క్రీస్తు వధువు అవ్వాలంటే, సత్యం ఆధారంగా బాప్తిస్మం పొంది, పరిశుద్ధాత్మ అనుగ్రహంతో, క్రీస్తుకు లోబడి, ఆయన పాదాల వద్ద కూర్చుని నేర్చుకోవాలి. ఈ సలహాను పాటించేవారు బోయజు అనే యేసుక్రీస్తు వధువుగా మారుతారు. ఇదే నయోమి అనే సత్యము రూతు అనే సంఘానికి వెదికిన మేలు.

## పేదవారు, ఐశ్వర్యవంతులు ఎవరు?

### రూతు 3 : 10

**అతడు నా కుమారీ, యెహోవాచేత నీవు దీవెన నొందినదానవు; కొద్దివారినే గాని గొప్పవారినే గాని యౌవనస్థులను నీవు వెంబడింపక యుండుట వలన నీ మునుపటి సత్ ప్రవర్తన కంటె వెనుకటి సత్ ప్రవర్తన మరి**

క్రీస్తుకు లోబడి ఆయన ఆజ్ఞలను పాటించేవారు, ఆయనతో నిబంధన అయిన బాప్తిస్మము మరియు పరిశుద్ధాత్మ అనుగ్రహము పొంది, ఆయనకు లోబడి ఆయన పాదాల వద్ద నేర్చుకునే వారిని చూసి బోయజు

అనే క్రీస్తు చెప్పేది ఏమిటంటే: మీరు యెహోవా చేత ఆశీర్వదించబడినవారు, మీరు ఈ లోక ఐశ్వర్యం దేవుడు ఇస్తాడని బోధించే కపట ఐశ్వర్యవంతులైన బోధలకు, తనను నీతిమంతుడిలా చూపించుకుంటూ వేషధారిగా ఉండి, పేదవాడిలా నటిస్తూ జీవించే అబద్ధం నిండిన కపట బోధల వెంట వెళ్ళకుండా, క్రీస్తు సత్యాన్ని అంగీకరించి దానిని గైకొనేవారిగా ఉన్నందున, వీరు విడిచి వచ్చిన అన్ని త్యాగాల కంటే, ఇప్పుడు ఆయన మాట ప్రకారం ఆయనను వెంబడించడం, మొదటి సద్గుణము కంటే క్రీస్తును వరుడిగా అంగీకరించిన గుణం ఉత్తమమైనదని బోయజు అనే క్రీస్తు చేత పొగడబడతారు. వీరు రాబోయే ప్రతిఫలమైన క్రీస్తు వధువు అయ్యే ఉద్దేశంతో లోకంలోని అన్ని సంపదల కంటే, క్రీస్తు నిమిత్తం వచ్చే నిందను గొప్ప భాగ్యంగా ఎంచడం మొదటి సద్గుణాల కంటే ఉత్తమమైనది (**హెబ్రీయులకు 11:27**). కాబట్టి, పేదవారు, ఐశ్వర్యవంతులు అనగా కపట బోధలను సూచిస్తుంది.

## ఎవరికీ తెలియకుండా వెళ్ళడం ఏమిటి?

### రూతు 3 : 14

**కాబట్టి ఆమె ఉదయము వరకు అతని కాళ్ల యొద్ద పండుకొని, ఒకని నొకడు గుర్తించుపాటి వెలుగు రాకముందే లేచెను. అప్పుడు అతడు ఆ స్త్రీ కళ్లమునకు వచ్చిన సంగతి తెలియజేయకుడని చెప్పెను.**

తెల్లవారుజామున ఎవరికీ తెలియకుండా ఉన్నప్పుడు బోయజు పాదాల వద్ద పడుకున్న స్త్రీ వెళ్ళిపోవడం ఎవరికీ తెలియకపోవడం దేనిని సూచిస్తుందంటే, ఈ వధువు తరగతి అయిన అన్యజనులు యేసుక్రీస్తు సత్యం పలకబడే చోటుకు వచ్చి నేర్చుకోవడం ఎవరికీ తెలియదు. అదే విధంగా, **రాత్రి కాలమైన సువార్త కాలం ముగిసి, వేకువ జామున క్రీస్తు**

వధువు అగునట్లు వీరు రూపాంతరం చెందడాన్ని ఎవరూ ఎరగకపోవడాన్ని ఇది సూచిస్తుంది. ఇదే మొదటి పునరుత్థానము (1 థెస్సలొనీకయులకు 4:15-17). వీరు అంతం వరకు క్రీస్తు పాదాల వద్ద నేర్చుకుంటారు. ఈ విధంగా, క్రీస్తు వధువుగా తనను తాను సిద్ధపరుచుకున్నదానిని ఎవరూ ఎరగనట్లు, వధువుగా లేచి వెళ్ళడాన్ని కూడా ఎవరూ ఎరుగరు అని దీని అర్థం.

## వధువు అవ్వడం ఎలా?

**గలతీయులకు 3 : 24**

**కాబట్టి మనము విశ్వాసమూలమున నీతి మంతులమని తీర్చబడునట్లు క్రీస్తు నొద్దకు మనలను నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాలశిక్షకుడాయెను.**

మనం వధువు అయ్యే అర్హతను ఎలా పొందగలము అంటే, వరుడైన యేసును విశ్వసించడానికే ధర్మశాస్త్ర కాలంలో జరిగిన సంఘటన మనకు ఉపాధ్యాయునిగా ఉంది. కాబట్టి, రూతు సంఘటన వధువు అగునట్లు మనల్ని సిద్ధపరిచే ఉపాధ్యాయునిగా ఉంది. నయోమి, రూతు ఎలా విడిపోకుండా ఉన్నారో, అలాగే సత్యము, సంఘము ఎన్నడూ విడిపోవు. ఈ సత్యము వరుడైన యేసు వధువుగా చేస్తుంది (కీర్తనలు 43:3). కాబట్టి, అన్యజనులమైన మనం వధువు అవ్వడం ఎలా అనేదానికి, సత్యం వినే రెండు రకాల వారిని మనకు మాదిరిగా ఇచ్చి, మనం ఓర్పా వలె సత్యం విని వెనక్కి వెళ్ళేవారిగా ఉన్నామా? లేక రూతు వలె సత్యాన్ని వెంబడించేవారిగా ఉన్నామా? ఓర్పా వలె సత్యం బాగుందని మెచ్చుకుంటూ దానిని వెంబడించక వెనక్కి వెళ్ళేవారిగా ఉండక, రూతు వలె ఏ స్థితిలోనైనా సత్యంపై రోషము కలిగి లోక ఆశలను, బంధుత్వాలను కోల్పోయి రాబోయే

ప్రతిఫలమైన క్రీస్తు వధువు అగునట్లు నయోమి అనే సత్య వాక్యము ద్వారా నడిపించబడితే క్రీస్తు వధువుగా మారుతాము.

రూతు యేసుక్రీస్తు వంశ చరిత్రలో చోటు సంపాదించుకుంది (**మత్తయి 1:5**). అన్యజనులమైన మనం కూడా క్రీస్తు సంతానంలో చోటు సంపాదిస్తాము (**గలతీయులకు 3:16, 29**).

## ఓర్పా ఎవరికి గుర్తు?

ఓర్పా అన్యజనురాలైన మోయాబు స్త్రీ. సత్యం వినే తరగతి. వీరు సత్యమంతా బాగుందని మెచ్చుకునే వారు. కానీ, సత్యం నిమిత్తం వచ్చే శ్రమలను, శోధనలను అంగీకరించే మనస్తత్వం లేనివారు. కాబట్టి, వారు లోక సుఖాల కోసం, భోగవంతమైన జీవితం కోసం, వధువుగా పిలవబడిన పిలుపును త్రోసివేసి, తమ తల్లి ఇళ్ళు అయిన పాత స్థలానికే వెళ్ళినవారు ఓర్పా తరగతి వారు. ఈ ఓర్పా సత్యం విని బాగుందని చెప్పి, దానిని వెంబడించక వెనుదిరిగే తరగతిని సూచిస్తుంది.

## రూతు ఎవరికి గుర్తు?

రూతు అన్యజనురాలైన మోయాబు స్త్రీ. సత్యం వినే తరగతి. ఈ తరగతి వారు సత్య వాక్యాన్ని విని దానిని హత్తుకుని రాబోయే ప్రతిఫలంపై దృష్టి నిలిపి, దీనివల్ల వచ్చే అన్ని కష్టాలను శ్రమలను మనఃపూర్వకంగా అంగీకరించి క్రీస్తుతో నిబంధన చేసుకుని, పరిశుద్ధాత్మ అనుగ్రహాన్ని పొంది, క్రీస్తుకు లోబడి, ఆయన పాదాల వద్ద నేర్చుకునే రూతు, వరుడైన యేసు వధువు తరగతిని సూచిస్తుంది.

## ఇద్దరిలో మనం ఏ తరగతి?

ఈ అన్యజనులలో సత్యం వినే ఓర్పా మరియు రూతు అనే రెండు

తరగతులలో సత్యం వింటున్న మనం, ఏ తరగతికి చెందినవారమో మనల్ని మనమే పరీక్షించుకుందాం. ఓర్పా వలె సత్యం బాగుందని చెప్పి మెచ్చుకుంటూ, సత్యం నిమిత్తం వచ్చే శ్రమలను అవమానాలను భరించడానికి ఇష్టపడక, లోక భోగాల కోసం పాత స్థలమైన తల్లి ఇంటికి తిరిగి వెళ్ళే తరగతిలో ఉన్నామా? లేక రూతు వలె సత్యం నిమిత్తం వచ్చే అన్ని శ్రమలను, కష్టాలను సంతోషంగా అంగీకరించి, సత్యం బోధించే సలహా ప్రకారం క్రీస్తుతో నిబంధన చేసుకుని, పరిశుద్ధాత్మ అనుగ్రహం పొంది, క్రీస్తుకు లోబడి ఆయన పాదాల వద్ద చివరి వరకు నేర్చుకునే వధువు తరగతికి చెంది, సత్యంలో నిలిచి ఉన్నామా? ఇందులో ఏ తరగతికి చెందినవారమో మనమే నిర్ణయించుకుందాం!

| నీడ | నిజం |
|---|---|
| బెత్లెహేము | రొట్టెల (ఆహారం) ఇల్లు |
| నయోమి | సత్యము |
| ఓర్పా (జింక) | వెనుదిరిగి వెళ్ళే తరగతి |
| రూతు (రోజా) | సత్యాన్ని వెంబడించే సంఘ తరగతి |
| బోయజు | యేసుక్రీస్తు |
| మోయాబు స్త్రీలు | అన్యజనులు |
| కరువు | యెహోవా ఆలోచన లేని కాలం |

| నీడ | నిజం |
| --- | --- |
| ఆహారం ఇచ్చుట | రాజ్య సువార్త ఇశ్రాయేలీయులకు ప్రకటించుట |
| యూదాకు వెళ్ళుట | అన్యజనులు రాజ్య సువార్తను వెదకుట |
| తల్లి ఇంటికి వెళ్ళండి | పాత స్థితికి తిరిగి వెళ్ళుట |
| నీతో వస్తాము | సత్యాన్ని వెంబడిస్తాము |
| ముద్దు పెట్టుకుని వెళ్ళడం | సత్యం బాగుందని మెచ్చుకోవడం |
| విడువక హత్తుకోవడం | సత్యాన్ని ప్రేమించడం |
| నీవు వెళ్ళు చోటకే నేను వస్తాను | సత్యానికి లోబడి వెంబడించడం |
| నేను కూడా మరణిస్తాను | మరణము నాకు లాభము |
| కోత ప్రారంభం | యూదుల కాలపు కోత |
| వెన్నులు ఏరుకోవడానికి వెళ్ళడం | సత్యం తెలుసుకోవాలనే వాంఛ |
| పొలం | సత్యం చెప్పబడే చోటు |
| ఇంటిలోకి వచ్చి కొద్ది సేపు | విశ్వాస గృహంలో చేర్చుకోబడటం |

| నీడ | నిజం |
|---|---|
| వేరే పొలానికి వెళ్ళకుండా | అసత్య బోధలకు చెవియొగ్గకపోవడం |
| పనికత్తెలతో ఉండు | క్రీస్తు శరీరమైన సహోదరులతో కలిసి ఉండటం |
| ఎవరూ ముట్టకుండా ఆజ్ఞ | దూతల రక్షణ |
| నీకు దప్పిక వేస్తే | సత్యం తెలుసుకోవాలనే వాంఛ |
| ముంచి తెచ్చే దానిలో తాగవచ్చు | సత్యం బోధించేవారి ద్వారా సలహా పొందుట |
| అంతా నాకు తెలియబడింది | తన అర్పణను క్రీస్తు ఎరిగి ఉండుట |
| నీ పనికి తగిన ప్రతిఫలం | క్రీస్తుకు వధువు అయ్యే అవకాశం |
| రొట్టె తిని | సత్యాన్ని అంగీకరించడం |
| ద్రాక్షారసంలో ముంచు | క్రీస్తు శ్రమలలో పాలుపొందటం |
| వేయించిన సెనగలు | సత్యాన్ని విభజించి బోధించడం |
| అత్తకు ఇచ్చింది | సత్యానికి నమ్మకంగా నడవడం |

| నీడ | నిజం |
|---|---|
| రెండు కోతలు | యూదుల కాలపు కోత,<br>అన్యజనుల కాలపు కోత |
| అత్త వద్ద నివసించు | సత్యంలో అంతం వరకు<br>నడిపించబడటం |
| స్నానము చేసి | బాప్తిస్మము పొందుట |
| నూనె రాసుకొనుట | పరిశుద్ధాత్మను పొందుట |
| వస్త్రములు ధరించుట | రక్షణ వస్త్రము ధరించుట |
| కళ్లమునకు వెళ్ళు | కోత పనిలో పాలుపంచుకొనుట |
| పాదాల వద్ద పడుకోవడం | క్రీస్తు వద్ద నేర్చుకొనుట |
| పేదవారు | కపటమైన దారిద్ర్యపు అబద్ధ బోధ |
| ఐశ్వర్యవంతుడు | సంపన్నమైన అబద్ధ బోధ |
| వెనుకటి సద్గుణము | యేసును వరుడిగా చేసుకోవాలని<br>కోరుకోవడం |
| నీవు యోగ్యురాలవు | క్రీస్తు వధువు అయ్యే అర్హత<br>గలదానివి |

| నీడ | నిజం |
|---|---|
| నేను నిన్ను వివాహం చేసుకుంటాను | అన్యజనులను కూడా వధువుగా చేసుకుంటాననే వాగ్దానం |
| ఎవరికీ తెలియకుండా ఉండటం | వధువుగా తనను సిద్ధపరుచుకోవడాన్ని ఎవరూ ఎరగకపోవటం |
| ముఖం తెలియకముందే లేచుట | వధువు ఎత్తబడటం ఎవరికీ తెలియకపోవటం |

**యోహాను 8 : 32**

**అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయునని చెప్పగా**

**యోహాను 17 : 17**

**నీ వాక్యమే సత్యము.**

దేవుడు తానే రూతు వలె సత్యాన్ని వెంబడించి బోయజు అనే క్రీస్తు వధువుగా మారుటకు కృప చూపును గాక!

**ఆమెన్**




# పరలోక దేవ మినిస్ట్రీస్



సమర్పించు

## Free Bible Study (Telugu)

మరింత సమాచారం కోసం సంప్రదించగలరు.

+91 730 53 53 23 5 freebiblestudytelugu@gmail.com